# లంచం

జడ్జీగారు భోజనం చేసి, చుట్టకాలుస్తో ఆఫీసు బల్లదగ్గిర కాయితాలు ముందు పెట్టుకొని, కూచున్నారు. రేపో కేసు జడ్జిమెంటు చెప్పాలి. నేరస్తుడికీ, యికముందు అట్టి నేరాలు చెయ్యబొయ్యేవారికీ, భయం కలిగేట్టు శిక్ష వెయ్యాలనుకున్నారు. యీ జడ్జిగారు, యే నేరానికైనా, వీలైనంత గొప్ప శిక్ష వేస్తారు. నేరస్తుడిమీద జాలిపడడం, సంఘానికేగాక, ఆ నేరస్తుడియడల కూడా నేరాలు చెయ్యడం నేర్పిపెట్టడమని ఆయన అభిప్రాయం. యీ నేరస్తుడు, గII సూర్యనారాయణగారు ఒక కంపెనీలో కాష్ కీపరు, ఆ కంపెనీ ప్రొప్రయిటరు, వెంకటరత్నంగారు కొద్దిరోజుల కిందటే చచ్చిపోయారు. ఆయన కొడుకు సుబ్బరామయ్యగారు ప్రొప్రయిటరయినారు. సూర్యనారాయణ కంపెనీవి అయిదువందల రూపాయలు అపహరించాడని ఈయన ఫిర్యాదు చేశాడు. తను ఆ రూపాయలు తీసుకొన్నమాట నిజమే గాని వెంకటరత్నంగారు తనను బహుమతిగా తీసుకోమన్నారని సూర్యనారాయణగారి వాదన. కాని ఆ రూపాయలు తీసుకోమని వెంకట రత్నంగారు వ్రాసిన వుత్తరం సూర్యనారాయణగారు పోయిందంటారు. చెక్కుమీద వెంకటరత్నంగారి దస్కతు ఫోర్జరీ చేశాడని సుబ్బరామయ్యగారు అనేక సాక్షుల్ని తీసుకొచ్చారు. నేరం రుజువయింది. వీడికెన్నేళ్ళు శిక్ష వెయ్యాలా అని జడ్జిగారు ఆలోచిస్తుండగా గది తలుపులు తెరుచుకొని ఆయన కూతురొచ్చింది.

"నాన్నా, నాన్నా, నీ కోసం యెవరొచ్చారో చెప్పుకో తీసుకొస్తా, చూడు" అని పరుగెత్తికెళ్ళి ఒక అయిదేళ్ళ పొట్టి అమ్మాయిని తీసుకొచ్చి వొదిలేసి పారిపోయింది. తాను రాసుకొనేప్పుడు యెవరన్నా 'డిస్టర్బ్' చేస్తే జడ్జిగారికి చాలా కోపం. కోపంతో తిరిగి చూసేప్పటికి, ఒక చిన్న పరికిణీ పట్టుకుని, జారికిందపడే వోణీ వేసుకుని, వుంగ్రాల జుట్టు కళ్ళల్లో పడుతూ, తలుపు దగ్గర్నుంచి ఆ చిన్నపిల్ల వస్తోంది. చంకలో చిన్న పిల్లి పిల్లని పట్టుకుంది. చేతులో ఒక కాయితం పెట్టి.

"ఏమిటమ్మాయీ ఎందుకొచ్చావు? ఎవరు నువ్వు?" ఒక చూపుతో ఖైదీలనీ, సాక్షుల్నీ వొణికించే కళ్ళల్లో ఆ కోపం, ఆ పెద్ద మీసాలూ, కఠినమైన ఆ కంఠం చూసి, ఆ బిడ్డ తెల్లబోయి భయంతో నుంచుంది. దాని భయాన్ని, చిన్నదనాన్ని చూసేటప్పటికి, ఆయనకి కొంచెం దయపుట్టి వృధాగా భయపెట్టానేమో అనుకున్నాడు.

"భయపడకు చెప్పు - ఏం? మాటలు రావూ?" అన్నాడు.

"ఊ.... ఊ..... ఊ నీకు.... నీకు... మా చిత్తిని తీసుకొచ్చా."

"చిట్టెవరు?"

అమ్మాయికి ధైర్యమొచ్చింది.

"యిదిగో" అని చంకలోవున్న పిల్లిపిల్ల వంక చూసింది.

"యిల్లారా" దగ్గరకెళ్ళింది. "యిదేనా చిట్టి?" అని పిల్లిపిల్లని వొళ్ళో పెట్టుకొన్నాడు. అది ఆయన బంగారు గుండీని పట్టుకొని పాకులాడుతోంది.

"యివన్నీ కూలా నీకియ్యడానికి తీసుకొచ్చా" అని కాయితం పెట్టి చూపించింది. దాంట్లోంచి మొహం అరిగిపోయిన చందనం బొమ్మా, కాలు విరిగిన గాజు కుక్కా రెండు గాజు గోళీకాయలు, తళుకు రేకు ముక్కలూ తీసింది. బడాయిగా ఆ కాయితాలు తీసి "యీ బొమ్మలన్నీ నేనే వేచా" వాటి అందం చూస్తే అమ్మాయి యెవరి సహాయం లేకుండానే, వేసినవని జడ్జిగారికి నిశ్చయమైపోయింది.

"సరేగాని, యివన్నీ యెందుకిస్తావు నాకు?"

"యియ్యను."

"మరి యియ్యడానికేగా వచ్చావు?"

"నీక్కావాలా? సరే, పోనీ, యిత్తాలే, యీ పిల్లీ, యీ కుక్కా యీ పటాలూ, అన్నీ యిత్తా మల్లీ అడగన్లే. మలి, మలి నువ్వు మానాన్నని కొత్తో పెత్తావుకదా? పెడితే యియ్యను. నువ్వు చెడ్డవాడివి. నీతో మాత్తాన్ను నీకేం యియ్యను."

జడ్జిగారికి సందేహం కలిగింది. యిదేదో కుట్రగా వుంది.

"పేరేమి అమ్మాయ్?"

"కమల"

"యేం కమల?"

"కమలే"

"యెవరి అమ్మాయివి నువ్వు?"

"అమ్మాయినే"

"మీ నాన్న పేరేమిటి?"

"చూర్నారాయన."

జడ్జీగారు కమల వంక చాలా కోపంగా చూశారు.

"తెలుసునా ఏం చేస్తున్నానో?"

"దొంగ తీర్పు చెప్పమని లంచమిస్తున్నావా! చాలా గొప్ప అపరాధమిది. దీనికి శిక్ష... చీ... చీ... గమ్మత్తుకన్నా నిన్ను కాదు. ఛా, యేడుస్తారా ఎక్కడన్నా? యింతే? వూరుకో తమాషాకి, కోప్పడాలని కాదు. నిజం, యిట్లారా. కూచో, ఏవీ, బొమ్మలు చూపించు నాకు." కమలని తొడమీదెక్కించుకుని, కన్నీళ్ళు తుడుస్తో "లంచమీయడానికి వచ్చినవాళ్ళమీద ప్రేమ చూపవలసి వొస్తుందనుకోలా ఎప్పుడూ" అనుకుంటున్నాడు. పెట్టెలో

వస్తువులొక్కొక్కటి తీసి చూసి, వాటి సంగతంతా కనుక్కుంటున్నాడన్న మాటేగాని, మనస్సు ముద్దాయి సూర్యనారాయణ మీద వుంది. అతను నీచమైన ఫోర్జరీ నేరం చేసినందుకు, గట్టి శిక్షను పొంది బుద్ధి రావలసిన నేరస్థుడుగా కనపడలేదు. యిప్పుడు ముద్దుమాటలు పలికే యేమెరగని యీ అమాయకపు బిడ్డ యావజ్జీవనము యీ తండ్రికి పడే శిక్షవల్ల అవమానాన్నీ నష్టాన్నీ అనుభవిస్తుంది. పాపం, యీ నిమిషాన సూర్యనారాయణరావు ఖైదులో కూచుని, తన వొళ్ళో వున్న యీ చిన్న పిల్లనీ, యీ బిడ్డ తనకోసం "నాన్న యేడీ" అని యాడవడం, తలుచుకొని యెంత కుళ్ళుతున్నాడో?

వెనకాలే ఆయన భార్య వొచ్చి నుంచుంది. చూశాడు.

"యిదంతా నువ్వు పన్నిన వ్యవహారం కాదూ?"

"కోపమా?"

"కోపమెందుకు? కాని యేం లాభం చెప్పు? యీ పసిపిల్లకేం అర్థమవుతుంది? వృధాగా యీ చిన్న హృదయానికి కష్టం కలిగించడమే గాని.... యెట్లా వొచ్చింది?"

"యీ బిడ్డకే తోచిందట. తల్లి యేడుస్తో వుంటే కారణమడిగింది. ఆమె చెప్పితే, యీ బిడ్డ "నాన్నని యెవరు కొట్లో పెడతా"రందిట. .'జడ్జీగారు' అంటే, "యివన్నీ జడ్జీగారికి ఇచ్చి, నాన్నని పెట్టకుండా చేస్తా" నని తనకి ప్రాణప్రియమైన వొస్తువుల్ని పట్టుకు బయలుదేరింది. పాపం, ఆమె ఏం చేస్తుంది? ఇల్లు యీ వీధిచివరే. ఆమెని నేనెరుగుదును. మొన్న అమ్మాయి పుట్టిన పండక్కి పేరంటానికొచ్చింది. పాపం జాలిగావుంది. ఆ మెట్లమీదపడి యేడుస్తోంది."

"సరేలే, కాని మనమేం చేస్తాం? యేం లాభం?"

"నిజమే, అయినా ఈ అమ్మాయిని, చూడండిట్లా, యీ కళ్ళని, యీ వుంగరాల జుట్టుని, ఆ మాటల్ని, చూస్తే మీ మనసు మెత్తపడుతుందని ఆశ."

జడ్జీగారు ఆలోచిస్తో, ఆ జుట్టు వుంగరాల్ని సర్దుతున్నారు.

"నేను కఠినంగా క్రోధంతో దొరికిన వాణ్ణల్లా శిక్షిస్తానని కాదూ నీ వుద్దేశ్యం?"

"ఛా, అదికాదు. మీ అంత న్యాయమైన జడ్జీలేరని అందరూ అంటారు. అది నేనెరుగుదును. కాని న్యాయం కంటే అధికమైంది యేమీ లేదూ? అక్కడల్లా కన్నీళ్ళతో ఆ చల్లని రాళ్ళని కరిగిస్తో యేడ్చే భార్యనీ, మన మాటలకర్థంకాక మీ మొహంకేసి, నా మొహంకేసీ చూస్తున్న యీ పసిబిడ్డనీ చూస్తే, యెవరికి ఆశపుట్టదు?"

జడ్జీగారు ఆ అమ్మాయి తెచ్చిన ఆవు బొమ్మని చూస్తున్నారు. కమల అంటోంది-

"అది ఆవు. కొమ్ములు కనపత్తంలా నీకు? అతు తిప్పు. నేనే గీత గీచా ఆవుకంటె, పిల్లి గియ్యటం బాగా చాతవుతుంది నాకు" అని కాయితం లాక్కుని తిప్పి చూపించింది, బడాయిగా.

"ఆ పెద్దవి గోల్లు, పీకుతుంది. నిన్నెప్పుడన్నా పీకిందా? అవి అచ్చరాలు కావు. తోకమీద మచ్చలు. తెల్లకాయితం దొరకలా, అందుకని రాసిం దానిమీదే..."

"అరే" అని కేకేశారు, జడ్జీగారు. యేమిటని అడిగింది భార్య.

"పోయిందన్న వుత్తరమే! యిది చూడు - యీ వుత్తరం పోయిందనడం చేతనే సూర్యనారాయణ కొంపముంచింది. యిదిగో, వెంకటరత్నంగారి దస్కతు, అయిదు వందల రూపాయలూ బహుమతిగా యిచ్చినట్లు స్పష్టంగా వుంది. యింకేం? యిది సూర్యనారాయణ వకీలుకి పంపిస్తా."

"పాపం ఆయన నిర్దోషేనా?"

"సందేహమేముంది? అమ్మాయ్, నీకీ కాయితమెక్కడిది?"

కమల భయంతో తల వంచుకుంది.

"నాన్నని వదిలి పెడితే చెబుతా, లేకపోతే చెప్పను."

"వొదిలిపెడతా."

"అయితే మంచివాడివి నీతో చెబుతా - నాన్నతో చెప్పకేం? చెప్పనని వొత్తెయ్యి. .. వెయ్యి.... అత్తాకాదు. సత్తెమేస్తుందీ అత్లా గిల్లు... నాన్న చొలుగులో దొరికింది నాకు. నాన్న చొలుగు తీత్తె కొడతా నన్నాలు మలి... మలి.... ఊ.... నాకు బొమ్మలేసు కోడానికి... యెందుకు కాయితం యివ్వలా?"

అమ్మ దగ్గిరికెళ్ళి, "జడ్జీగారు నా పిల్లి పటం లంచం తీసుకొని, నాన్నని వొదిలేస్తారట" అని చెప్పు... రాత్రికి మీ నాన్నగారు యింటికి వొస్తారు. పో."

జడ్జిగారి భార్య కమలని చెయ్యి పట్టుకుంది. కమల కదల్లేదు. దిగులు మొహం పెట్టింది.

"చిత్తినోమాతు ముద్దుపెత్తుకొత్తా."

"నా పిచ్చితల్లీ."

"చిట్టిని తీసుకెళ్ళు. నిన్ను వొదిలి వుండదుట."

"చిట్టికీ నాకూ పడదు, నన్ను రక్కుతుంది."

కమల సంతోషంతో చిట్టిని చంకన పెట్టింది. ఐనా కాళ్ళుమాత్రం బల్లమీదే వున్నాయి. బొమ్మలన్నిటినీ పెట్టెలో పడేసి, జడ్జీగారు కమలకిచ్చారు.

"మలి, మలి ఇవన్నీ, తీసికెళ్ళినా, నాన్నని వదిలిపెడతావా? మలి."

"వొదులుతాలే, తీసుకెళ్ళు" పెట్టెని పట్టుకుని తలుపు దగ్గిరకి నడిచింది. అక్కడాగి, ఒక్కరవ్వ ఆలోచించి వెనకాలకొచ్చింది. ఆ పెట్టి బల్లమీద పెట్టి ఒక్కొక్క బొమ్మ తీసి, యిటు తిప్పి, అటు తిప్పి, చివరికి కుంటికుక్కనీ, రెండు పటాలనీ యేరి, జడ్జీగారికిచ్చింది.

"వీటిని తీసుకోపోనీ, నీకేమీ వుండవద్దూ ఆడుకోడానికి, అన్నీ నేనే తీసుకొంటె, మలి, మలి నాన్నని తప్పకండా వొదలాలి. సత్తెంలాగు అబద్ధాలు చెప్పకూడదు. చెపితె, రెండుకల్లూ పోతాయి, నాకేం?'' అని వెళ్ళింది.

"యిన్నేళ్ళు జడ్జీపని న్యాయంగా చేసి, ఆఖరికి నేను కూడా లంచం తీసుకున్నాను. గీతతప్పుతుందా యెంతవారికైనా?'' అనుకున్నారు జడ్జిగారు.

(ఇంగ్లీషు కథ ననుసరించి)

◆ ◆ ◆

*రచనాకాలం : **1924***

*ప్రచురణ : **(చుక్కమ్మ కథల సంపుటి) దేశి కవితామండలి, 1957***